# కాటికాపరులు

లోహితాసుడు చనిపోయినప్పడు చంద్రమతిని కాటికాపరిగా ఉన్న ఆమె భర్త సత్యహరిశ్చంద్రుడు కాటిసుంకం కట్టమంటాడు. ఆమె తనవద్ద డబ్బులేదనగా మెడలోని మంగళసూత్రాన్ని తెంపి ఇవ్వమంటాడు. నా పెనిమిటికి తప్ప యెవ్వరికీ నా మంగళసూత్రం కనబడదు" అని తన మంగళసూత్రం గుర్తించింది తన భర్త అయిన హరిశ్చంద్రునిగా గమనించి, భార్యా భర్తలిద్దరూ తమకొచ్చిన కష్టాలకు దు:ఖిస్తూ ఉంటారు. అంతట పరమశివుడు ప్రత్యక్షమై లోహితాసుడిని బ్రతికించి, ఒక ఆడబొమ్మ, మగ బొమ్మలకు ప్రాణంపోసి వారిని కాటికాపరులుగా ఉండవలసిందిగా ఆదేశిస్తారు. అప్పటినుండి ఈ కాటికాపరుల తెగ ఆవిర్భవించిందని చెప్పబడుతోంది.



వీరు పెద్ద గంట చేతపుచ్చుకొని ఇంటింటికి వెళ్ళి ఇంద్రజాలాలు చేస్తూ అడుక్కుంటారు. ప్రపంచంలో మొట్టమొదటగా హస్త లాఘవం విద్య ప్రదర్శించినవారు కాటికాపరులని ప్రతీతి. ఆ విద్య ౨ సంవత్సరాలు సాధిస్తేగాని రాదు.

పారితోషికం ఇచ్చేంత వరకు శ్మశానంలో శవాన్ని దహనంచెయ్యనివ్వకుండా కాటిపై పడుకొంటారు కాబట్టి వీరికి కాటికాపరులు అని పేరు వచ్చింది. వీరు భిక్షాటన చేసుకొనుటకు ఊళ్ళు పంచుకుంటారు. ఒకరు ఇంకొకరి గ్రామానికి వెళ్లినచో పంచాయతీ పెడతారు.

వీరు ఇంటింటికి భిక్షాటనకు వచ్చినప్పడు ధాన్యంపెట్టిన తర్వాత దీవించి వెళ్లిపోతారు. ఆ యింటివారు ఆరోగ్యంగా ఉండాలని "నపీరా" అనే వాద్యాన్ని వాయిస్తారు. అదివాయిస్తే ఆ యింటిలో భూత, ప్రేత, పిశాచాలు ఉండవని వారి నమ్మకం.

వీరు భిక్షకు ముదిరాజుల కులస్థుల యిళ్లకు వెళ్లరు. ఎందుకనగా ముదిరాజులు "పోటపై" వచ్చే అంటే చెట్లపై వచ్చే ఆదాయం (పళ్లు వగైరా)తో బ్రతుకుతారు కాబట్టి వీళ్లకి కాటె, పోటు తేడాలుండుటవల్ల వాళ్ల యిళ్లకు భిక్షకు వెళ్లరు.

భిక్షాటనకు వెళ్లని రోజులలో ప్లాస్టిక్ సామానులు అమ్ముకొని బ్రతుకుతున్నారు.

ఈ కళాకారులు తూర్పుగోదావరి జిల్లాలో  ఎక్కువగా ఉన్నారు.